# అల్పాయుష్షు




## డాక్టర్ జి.వి.కృష్ణయ్య

ఆ రోజు అర్ధరాత్రి తిరుమల ఎక్స్‌ప్రెస్ రావాల్సిన సమయం కంటే గంట ఆలస్యమని చావు కబురు చల్లంగ చెప్పినట్లు మైకులో అనౌన్స్ చేశారు. అకారణంగా అమెరికావాడు ఇరాక్‌పై యుద్ధం ప్రకటించినట్లు ప్లాట్‌ఫారం బెంచి మీద కూచున్న మామీద దోమలు దాడి చేస్తున్నాయి. తరమడానికి మేం ప్రయత్నిస్తున్నా దోమలు మా సహనాన్ని పరీక్షిస్తున్నాయి. బంకర్లో దాక్కున్నా బయటకు లాగి సద్దాం హుస్సేన్‌ను అమెరికా బుష్ బాదించి బందించినట్లు ఏమాత్రం అవకాశం దొరికినా దోమలు దూరి కుడుతున్నాయి. చూసి చూసి ఓర్చుకోలేక మేమూ దొరికినదాన్ని దొరికినట్లు చంపి నలిపేయడానికి ఆత్మాహుతి దళాల్లా సిద్ధమై దోమలపై ప్రతీకారం తీర్చుకుంటున్నాం.

డిశంబరు నెల చలికాలం. ప్రయాణికుల రద్దీ మిగతా రోజుల్తో పోల్చుకుంటే తక్కువగా ఉంది. అదే ప్లాట్‌ఫారం మీద అక్కడక్కడ వీధిబాలలు (అనాధలు?), అడుక్కునేవాళ్ళూ కడుపులో కాళ్ళు పెట్టుకుని ఆదమరచి నిద్రపోతున్నారు. అంత చలిలో ఈ దోమల మధ్య అలా హాయిగా ఎలా నిద్రపోతున్నారా అని ఆశ్చర్యంగా ఉంది. ఆకలి రుచెరుగదు. నిద్ర సుఖమెరుగదన్న నానుడి నిజమనిపించింది.

దూరం నుండి ఒక యువతి బరువైన బ్యాగుని భుజం పైకి ఎగదోసుకుంటూ ప్రక్కన ఓ ఎనిమిదేళ్ల కుఱ్రాడి భుజంపై చెయ్యి వేసి నడిపించుకుంటూ వచ్చి మా వెనుక ఆగింది. లగేజి బ్యాగు బెంచిమీద వుంచి అందులోంచి దుప్పటి తీసింది. బెంచిమీద పరిచి కుఱ్రోడ్ని

పడుకోబెట్టి మిగతాది పైన కప్పింది.

ఆమె వయస్సు ఇరవై, ఇరవై రెండు సంవత్సరాల మధ్య ఉంటుంది. మాసిన లంగా, ఓణీ ధరించిన ఆమె వంటిపై ఎలాంటి ఖరీదైన ఆభరణాలూ లేవు. సత్తుగాజులు, చింపిరి జుట్టు, పీక్కుపోయిన మొహంతో వయసుకు తగ్గ వర్చస్సు లేని యవ్వనంతో యథాలాపంగా వెనుక నిలబడి పిల్లాడ్ని వదే వదే చూసుకుంటుంది.

ట్రయిన్ రాలేదన్న విసుగూ దోమలు కుడుతున్న బాధా వెరసి మహా చిరాకు పుడుతుంది. మా ఆవిడా నేనూ ఒకరికి ఒకరు తోడున్నాం కాబట్టి ట్రయిన్ ఆలస్యమయినా ఓపిగ్గా వెయిట్ చేయగలుగుతున్నాం.

''అన్నా ! వచ్చే బండి సింగరాయకొండలో ఆగుతుందా !" వెనుక నిలబడి వున్న యువతి అడిగింది.

"మీరెక్కడికి వెళ్ళాలా?"

"సింగరాయకొండ కన్నా ! మాకు తెలియక నెల్లూరులో తిరుమల ఎక్స్‌ప్రెస్ ఎక్కాం. అది సింగరాయకొండలో ఆగదట. ఇక్కడ (ఒంగోల్లో) దింపేశారు. సింగరాయకొండలో ఆగే బండ్లు ఇప్పుడే మయినా వున్నాయా".

నాకు పూర్తిగా తెలియదు కనుక్కుందాముండమని ప్లాట్‌ఫారం మీద టీ అమ్ముకునే కుర్రాన్ని అడిగాను. ఆ మాత్రం తెలీదా అన్నట్లు ఎగా,దిగా చూసి సర్కార్, నారాయణాద్రి లేటుగా వస్తున్నాయి అవి ఆగుతాయని, "చాయ్, చాయ్ - టీ, టీ" అంటూ ముందుకు పోయాడు.

ఇంత అర్ధరాత్రి తోడెవరూ లేకుండా ఒక్కతె చిన్న కుర్రాడ్ని వెంటబెట్టుకుని ఎక్కడ్నుంచి వస్తుందో అర్థం కాక మా ఆవిడ ఆమె వైపు తిరిగి అడిగింది.

మద్రాసు నుండి నెల్లూరుదాకా వచ్చి అక్కడ తెలియక రైలెక్కి యిలా ఇబ్బంది పడుతున్నట్టు తెలిసింది.

''మద్రాసుకి ఒక్కదానివే పోయి వస్తుండావా? ఏం పని?" మా ఆవిడ ఆరా తీయడం మొదలుపెట్టింది.

"సంవత్సరం క్రితం ఈ అబ్బాయి చెట్టు మీద నుండి పడ్డాడక్కా! నాలుగు నెలలు ఒంగోలు ఆస్పత్రులన్నీ తిరిగి చూపించాం. అప్పుడు తగ్గినట్టే తగ్గి మల్లా తలపై బుడిపెలా పెరిగింది. నరాల డాక్టరుకి చూపిస్తే ఏదో అనుమానంగా వుందని మద్రాసుకి పంపించారు. అప్పట్నించి తిరుగతానే వుండాం గాని తగ్గడం లేదు."

పిల్లవాడు బొద్దుగా ముచ్చటగా వున్నాడు. మామూలుగా చూస్తే ఏ జబ్బూ లేనట్లే వున్నాడు. ఆమె నెత్తిన టోపీ ప్రక్కకు తీయగానే నుదిటిపై బాగం ఎద్దు మూపులా వుబ్బి వుంది. గుండు చేసినట్లు వెంట్రుకలన్నీ రాలిపోయున్నాయి. గాయం మానిందిగాని వాపు తగ్గలేదనుకున్నాం.

''పెద్దవాళ్ళు ఎవ్వరు లేరా !'' అనుమానంగా అడిగాను.

"మా నాన్న వున్నాడు ముసలాయన. ఎక్కడకు రాలేదు." అంది.

"ఈ బాబు మీ తమ్ముడా !" మా ఆవిడ అడిగింది.

"కొడుకు" టక్కున చెప్పింది.

నేనూ మా ఆవిడ ఆశ్చర్యంగా ఒకరి మొకాలు ఒకరు చూసుకున్నాం. ఈ వయస్సులో ఎనిమిదేళ్ళ కొడుకున్నాడంటే ఏ వయసులో వివాహమయ్యుంటుందో ఊహించాం. ఆధునిక సమాజంలో జరుగుతున్న ఇలాంటి పెళ్ళిళ్ళు బాల్యవివాహాలు కావా? అనిపించింది.

ఆడపిల్ల పెళ్లయిపోతే గుండెమీద కుంపటి దింపుకున్నట్లు భావించే కాలంలో ఈమె పెళ్లి ఏ తండ్రికి బరువై బాధ్యత దించుకున్నాడో అనిపించింది.

"పిల్లాడి నాన్నేమయ్యాడు." మా ఆవిడే అడిగింది.


"మూడేళ్ళక్రితం చనిపోయాడు. లారీ క్లీనర్‌గా పోతుంటే యాక్సిండెంటయ్యింది."

మనస్సు కలుక్కుమంది.

మొదటిసారి ఆమెను చూసినపుడే అనుమానమొచ్చింది. చిన్న వయస్సులోనే జీవితంలో ఏదో కోల్పోయిన వైరాగ్యపు ఛాయలు ఆమె మొహంలో కనిపించాయి.

మా ఆవిడ కనిపించని దేవుడ్ని కటువుగా తిడుతుంది. ఆ దేవుడు ఏడ్చేవాళ్లనే ఇంకా ఏడ్పిస్తాడు. ఇంత చిన్న వయస్సులో పసుపు, కుంకాలు తీసుకుపోయాడు. ఏ అచ్చటా, ముచ్చటా తీరకుండానే కష్టాల్లో పడింది పాపం. జాలిగా ఆమె వైపు చూస్తూ వుంది. కొన్ని క్షణాలు మాటలు కరువైన నిశ్శబ్దం.

ఆమె ఎవరి ఓదార్పూ, సానుభూతి




డాక్టర్ జె. భాగ్యలక్ష్మి రచించిన ఆంగ్ల కవితా సంపుటి "వెన్ ఫార్చ్యూన్ స్మైల్డ్"ను ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్, న్యూఢిల్లీలో ప్రముఖ కవి, కళా విమర్శకుడు శ్రీ కేశవ్ మల్లిక్ ఆవిష్కరించారు. ప్రొఫెసర్ కె. సచ్చిదానందన్ సభాధ్యక్షత వహించారు.

కోసం ఎదురు చూస్తున్నట్టు లేదు. యథాలాపంగా చెప్పేసి పిల్లవాడ్ని దోమలు కుట్టకుండా దుప్పటి కప్పుతూ తలదగ్గర నిలబడి టవల్‌తో దోమల్ని ఇసురుతోంది.

"అన్నా ! మీకు ఇంగిలీసొచ్చా!" అంది.

ఏమన్నట్లు తల నిలువుగా వూపాను. జిప్పు లాగి బ్యాగునుండి తీసిన నోట్‌బుక్‌లోంచి ఒక అడ్రసు కాగితం తీసి నాచేతికిస్తూ "పుట్టపర్తి ఆస్పత్రిలో బాగా చూస్తారా అన్నా." అడిగింది.

"చూస్తారు గాని, చాలా ఆలస్యమవుతుంది. పేషెంట్స్ ఎక్కువగా ఉంటారు. ఏం!" కాగితం తీసుకుంటూ అన్నాను.

"బాబుకి సంవత్సరం నుండి మద్రాసు స్టాన్లీ ఆస్పత్రిలో చూపిస్తున్నాం. ఆ పరీక్షలని ఈ పరీక్షలనీ చేస్తున్నారే గాని మాకేం చెప్పట్లేదు. పోయిన సారల్లా మా చేత వెయ్యి రూపాయల మందులు తెప్పించి వాడుతున్నారు. అయినా తగ్గట్లేదు. యిన్నాళ్ళ తర్వాత ఇప్పుడు ఇక్కడ లాభం లేదు, పుట్టపర్తికి తీసుకుపొమ్మన్నారు. చాలా ఖరీదు మందులు వాడాలి, ఇక్కడుండవు. బయట కొనాలంటే శానా దబ్బులవుతాయి- పుట్టపర్తిలో అయితే మొత్తం ఉచితంగా చూస్తారు. అక్కడ చూపించమని డిశ్చార్జి చేసేశారు." దీనంగా చెబుతుంది.

"అదేంటండీ ! ఇన్ని రోజులుంచుకుని మంచి మందులు లేవని ఇప్పుడు పంపించడం. అంత పెద్ద హాస్పటల్‌లో లేని మందులు పుట్టపర్తిలో ఎట్టుంటాయి." అమాయకంగా అడిగింది మా ఆవిడ.

"మందులెందుకుండవే! డబ్బులు పెడితే ఎక్కడయినా దొరుకుతాయి. ఖరీదయిన మందులు గవర్నమెంటు హాస్పటల్లో వుండవని డాక్టరుగారు క్లియర్‌గా చెప్పాడు గదా!దానర్థం ఖరీదైన వైద్యం బయటే దొరుకుతుందని గదా ! ఆ డాక్టరుగారు నిజాయితీగా చెప్పి పంపినందుకు సంతోషించాల."

"పుట్టపర్తి సాయిబాబాకు అంత ఖరీదయిన మందులు, అంత పెద్ద హాస్పటల్ కట్టడానికి, డాక్టర్లకి జీతాలివ్వడానికి డబ్బు ఎక్కడ్నుంచి వస్తుందండీ." మా ఆవిడకి ధర్మ సందేహాలొచ్చాయి.

"గాల్లోంచి బూడిదొచ్చినంత ఈజీగా డబ్బుల కట్టలు రావు. ఎవరో ఒకరు డొనేట్ చేసిన డబ్బులే ఈ సేవా కార్యక్రమాలకు ఉపయోగిస్తుంటారు. నీకో విషయం తెలుసా.... అనంతపురం, కర్నూలు చుట్టుప్రక్కల ప్రజల దాహార్తిని తీరుస్తున్నది కూడా సాయిబాబా ట్రస్టే. ప్రభుత్వం మాకు గతిలేదని ఆయన కాళ్ళమీద పడితే.... వందల కోట్లు ఖర్చుపెట్టి పైపులైన్లు వేసి నీటి సరఫరా చేస్తున్నాడు. మహా మహా మంత్రులు, ముఖ్యమంత్రులు, గవర్నర్లు, రాష్ట్రపతులు ఆయన కాళ్ళదగ్గర కూర్చుని దర్శన భాగ్యం కోసం ఎదురు చూస్తుంటారంటే.... సామాన్యుడనుకున్నావా? చేతగాని ప్రభుత్వాల కంటే ఏదో ఒకటి చేస్తున్న బాబాలూ, స్వాములూ, సన్యాసులు అధికారంలోకి రావడం బెటర్. తమ బొక్కసాలు నింపుకునే రాజకీయ నాయకులకంటే మేలు గదా ! ఎన్నికల పేరుతో ఎన్ని వందల వేల కోట్లు వృధా అవుతుంది తర్వాత ప్రజల కేమన్నా ఒరుగుతుందా ? లేదు గదా ! అందుకని ఎన్నికలు, గిన్నికలు లేకుండా ప్రభుత్వాల్ని డిస్మిస్ చేసి పారేసి ప్రజలంతా బాబాలూ, స్వాముల్ని నమ్ముకుని బతకడం మంచిదేమో? భక్తీ, భుక్తీ రెండూ ఒకేసారి వస్తాయి గదా !" నేను మాట్లాడుతున్నంత సేపు తెరిసిన నోరు మూయకుండా ఆలకిస్తుంది మా ఆవిడ.

మా మాటలు ఆ యువతికి అర్థమయ్యాయో లేదో గాని మా వైపే చూస్తూ కుర్రాడి కాలిమీద దోమను టవల్‌తో కొడుతుంది. మా మాటల్లో పడి ఆమె సంగతి మరచిపోయాం. నోట్‌బుక్ నా చేతికిచ్చింది. అంతకు ముందు తీసుకున్న పేపర్ మీద అడ్రస్ చూసాను.

క్యాన్సర్ డిపార్టుమెంటు, సాయిబాబా హాస్పిటల్స్, పుట్టపర్తి అని వుంది. "ఇదేంటి క్యాన్సర్ డిపార్టుమెంటుకి రాశారు" ఆశ్చర్యంగా ఆమె వైపు చూసాను.

నా నోటి నుండి మాట బయటకు రాకముందే బిత్తరపోయింది.

"క్యాన్సర్ హాస్పిటల్‌కి రాసారా ! అయితే ఇంక నా బిడ్డకు నయం కాదా ? బతకడేమో ? అయ్యో దేవుడా నేనెంత దరిద్రపు దాన్నిరా !" బిగ్గరగా ఏడుస్తుంది. ఆమె శరీరమంతా కంపించి పోతుంది. కళ్లు పెద్దవి చేసి బ్యాగు తెరిసి అందులోని రిపోర్టులన్ని ఏడుస్తూనే బయటకు లాగి చూడమన్నట్లు నా ముందేస్తుంది.


ఆ సమయంలో ఆమెని చూస్తేనే భయమేస్తుంది, బాధేస్తుంది.

ఊహించని ఈ సంఘటనకి నా వళ్లు జలదరించింది. కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

నేనవసరంగా గట్టిగా చదివి ఆమెలో అలజడి సృష్టించానేమో అనిపించింది. అసలే ఒంటరిగా వుంది. షాక్ లాంటి ఈ వార్తను ఎలా భరించగలుగుతుంది. నాకు చెమటలు పడుతున్నాయి.

"చూడండయ్యా నా బిడ్డని, ఎంతముచ్చటగా వున్నాడో... అయ్యా...." అంటూ నిద్రపోతున్న కుర్రాన్ని చూపిస్తూ ముఖాన్ని చేతులతో తడుముతూ, ముద్దులు పెడుతూ ఏడుస్తుంటే చుట్టూ చేరి చూస్తున్న వారి కళ్ళ నిండా సానుభూతే !

తల్లి ఏడుపుకి నిద్ర



లేచాడు. ఎదురుగా ఏడుస్తున్న అమ్మని చూసాడు. అమ్మ ఎందు కేడుస్తుందో అర్థం కాని ఆ పసి హృదయం చుట్టూ చేరిన వారిని బిత్తర బిత్తరగా చూస్తూ అమ్మ వైపు జరిగాడు.

తల్లి చెంపలు తడుముతూ "ఎందుకమ్మా ఏడుస్తున్నావు?" అంటూ గుండెలకు ఆనుకుని కూర్చున్నాడు.

ఆమె దుఃఖ ప్రవాహం ఉప్పెనై చెలియలి కట్టదాటుతున్న సముద్రపు ఘోషలా వుంది. శబ్దాల్ని గొంతులోనే అణుచు కుంటూ బిడ్డను గుండెలకు హత్తుకుంది.

"తగ్గిపోతుందిలేమ్మా ! ఏడ్వకు. బాబు భయపడతాడు. పెద్ద దానివి నీవే కంగారు పడితే ఎలాగ చెప్పు?" ఓదార్చాం.

"ఆ జబ్బయితే ఇంకేం తగ్గుతుంది లేన్నా". కన్నీళ్ళు తుడుచుకుని పిల్లాడ్ని పడుకోబెట్టి దుప్పటి కప్పింది.

"లేదు లేదు ! ఇప్పుడు మంచి మందులే వచ్చాయి. కాస్త ఖర్చు పెట్టుకో గలిగితే...." నేను ఏదో చెప్పబోయాను.

"కూలో నాలో, అప్పో, సప్పో చేసయినా నా బిడ్డను బతికించుకుంటాను. దిక్కులేని దాన్ని. ఈ బిడ్డకోసమే బతుకు తున్నానయ్యా. మద్రాసులో ముందేమో.... అదేనన్నారు తర్వాత అదికాదులే అన్నారు. ఇప్పటిదాకా.... ఇది పలానా అనిచెప్పనే....లేదన్నా!" ప్రయత్నించినా కొన్ని కేసులు ఫెయిలవుతుంటాయి. అలాం టప్పుడు రోగులూ వారి బంధువులూ పొగిడిన నోటితోనే శాపనార్థాలు పెడుతుంటారు. అలాంటి సహజమైన కోపం ఆమె మాటలో కనిపించింది.

"ముందే తెలిసినా నీవు చేయగలి గిందేమీ లేదు గదమ్మా ! జబ్బలాంటిది. వాళ్ళ ప్రయత్నం వాళ్ళు చేశారు. ఆపరేషన్ చేశారు. కీమో థెరఫీ ఇచ్చారు. మందులు వాడారు. ఇవ్వన్నీ బయట చేయించాలంటే ఎంత డబ్బయ్యుండేది. విషయం తెలిస్తే తట్టుకోలేవని నీకు చెప్పి వుండకపోవచ్చు. వాళ్ళ స్థాయిలో వాళ్ళు ప్రయత్నించారు." రికార్డులు చూసి జరిగిన ట్రీట్‌మెంటు గురించి వివరించాక ఆమె కొంత నిదానించింది.

"డాక్టర్లు బాగానే చూసారన్నా ! నా అదృష్టమే బాగాలేదు. నాకర్మకి వాళ్ళు మాత్రమేం చేస్తార్లే."

పిల్లాడ్ని చూస్తే జబ్బు తీవ్రత తగ్గి నట్టుంది. ఒంగోలు నుండి పుట్టపర్తికి బస్సు లున్నాయి. మీ అదృష్టం బావుండి వెంటనే చేర్చు కున్నారంటే బావుంటుందని ధైర్యం చెప్పాం.

"ఏమో ! ఇకాభగవంతుడిదే భారం" పైన చూసి కళ్ళు మూసుకుని చేతులు జోడించింది.

నే వస్తున్నానంటూ తిరుమల ఎక్స్‌ప్రెస్ కూతేసింది. ఇక్కడే కూర్చోండి దీని తర్వాత సర్కార్ వస్తుందని మా లగేజి తీసుకుని జనరల్ కంపార్ట్‌మెంట్ ఆగే చోటుకి పోయాం.

అక్కడ నిలబడ్డా మా చూపులు, ఆలోచనలు ఆ తల్లీ, బిడ్డల చుట్టే తిరుగు తున్నాయి. రైలొచ్చి ఆగడంతో మా ఆలోచనలకు బ్రేక్ పడి కంపార్ట్‌మెంట్‌లో సీట్ల కోసం వెతికి, వెతికి సర్దుకుని కూర్చున్నాం.

ప్లాట్‌ఫారం మీద సంఘటన తాలూకు దృశ్యాలు నన్ను వదిలి పెట్టడం లేదు. సరయిన వైద్య సదుపాయం అందక ఎంతమంది నిస్సహాయులు, నిర్భాగ్యులు అల్పాయుష్షుతో పోతున్నారోననిపించింది. ఈ వ్యవస్థ ఇలా వున్నంత కాలం ఈ పరిస్థితి ఇంతేనేమో?...... కళ్ళు మూసినా నన్ను వెంటాడుతున్న ప్రశ్న.



కథానిలయం, శ్రీకాకుళంలో దాట్లదేవదానంరాజు రచించిన 'సరదాగా.... కాసేపు' రాజకీయ వ్యంగ్య కథనాల్ని ప్రముఖ కథా రచయిత కాళీపట్నం రామారావు ఆవిష్కరిస్తున్న దృశ్యం. చిత్రంలో డా॥మానేపల్లి, దేవదానంరాజు, జ్వాలాముఖి, అల్లంరాజయ్య ఉన్నారు.



ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ స్వర్ణోత్సవాల సందర్భంగా ఇనాక్‌ను సత్కరిస్తున్న ఆచార్య సి.నారాయణరెడ్డి. చిత్రంలో డా॥ఎం.నాగన్న,కె. ఆనందన్, ననుమాసస్వామి, ఎస్వీ సత్యనారాయణ ఉన్నారు.